# లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- రుణాలపై బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సమీక్ష



ప్రొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, బ్యాంకర్లు, అధికారులు

కరీంనగర్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలో లక్ష్యం మేరకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులకు పంట రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎంజీపీవై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వంద శాతం లక్ష్య సాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేసుకునే అంశంపై అవగాహన కల్పించాలని, జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.5648.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు గానూ రూ. 2233.69 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో రూ. 1212.49 కోట్లు, విద్యా రుణాలకు రూ. 8.78 కోట్లు, హౌసింగ్ రుణాలు రూ. 145.96 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.386.69 కోట్లు, ఇతర రంగాలకు సంబంధించి రూ. 1660.51 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 75.49 శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ పథకాల్లో రుణాలు మంజూరైన లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తిరిగి సకాలంలో బ్యాంక్‌కు చెల్లించేలా ఆయా శాఖల అధికారులు జిల్లాలో రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని, జిల్లాలో ప్రధానమంత్రి స్వానిధి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. విశ్వభారత్ సంకల్ప యాత్ర (వీబీఎస్‌వై)లో భాగంగా కరీంనగర్ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో అన్ని బ్యాంకు శాఖలు ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), ప్రధానమంత్రి జీవన జ్యోతి (పీఎం జీజీబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), పీఎం స్వానిధి, ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ), విశ్వకర్మ యోజన, తదితర పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించి, అర్హులను గుర్తించాలని ఆదేశించారు. అనంతరం నాబార్డ్‌కు సంబంధించి 2024–25 జిల్లా ప్రొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్, డీఆర్డీవో శ్రీలత, ఎల్‌డీఎం ఆంజనేయులు, ఆర్‌బీఐ అధికారి సాయితేజ, నాబార్డ్ ఏజీఎం ప్రకాశ్, ఎస్‌బీఐ ఏజీఎం రవిశంకర్, యూబీఐ కలీమ్, టీజీబీ ఏజీఎం ప్రభుదాస్, కేడీసీసీ సీఈవో సత్యనారాయణ, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, కరీంనగర్ లోకల్ బ్రాంచ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బ్యాంకర్లు, అధికారులు



ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బీఎన్‌రావు

# మెడికోల దాహం తీర్చేందుకే వాటర్ ప్లాంట్

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు
- మెడికల్ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

విద్యానగర్, డిసెంబర్ 13: కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుతున్న మెడికోల దాహం తీర్చేందుకే ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్, సంజీవని చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ఆయన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శీల లక్ష్మీనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎన్ రావు మాట్లాడుతూ, బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఉమ్మడి జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న బాలికలను గుర్తించి మందులతోపాటు పౌష్టికాహారం అందించామన్నారు. పేద వైద్య విద్యార్థులకు చేయూతనందించామని, పేదలకు మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. మెడికల్ కళాశాలలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు మురళీధర్ రావు, కిషన్, అలీం, రామ్‌చరణ్ పొలాస, విజయలక్ష్మి, ఝాన్సీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంతన్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 13: నగరంలోని 11కేవీ విద్యానగర్, మంకమ్మతోటలో డీటీఆర్ పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయదుర్గ కాలనీ, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ వెనుక ప్రాంతానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే, మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్ గడ్డలో కొంత ప్రాంతం, గోపాల్‌రావు బిల్డింగ్ ప్రాంతాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. 11కేవీ గీతాభవన్ ఫీడర్‌లో కొత్త డీటీఆర్ లైన్ పనులు చేపడుతున్నందున రాంనగర్, పద్మనగర్, మంకమ్మతోట, సహజ అపార్ట్‌మెంట్ ఏరియా, ధన్గర్‌వాడీ స్కూల్ ప్రాంతం, కమల నిర్మల అపార్ట్‌మెంట్ ఏరియా, ఓల్డ్ లేబర్ అడ్డా, ఆకుల శైలజ హాస్పిటల్ ప్రాంతానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

# జిల్లా కోర్టు ఆవరణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు



సీపీ అభిషేక్ మహంతికి బీపీ పరీక్షిస్తున్న వైద్యురాలు

కోర్టుచౌరస్తా, డిసెంబర్ 13: జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతితో కలిసి జిల్లా జడ్జి బీ ప్రతిమ ప్రారంభించారు. జిల్లా జడ్జి చొరవతో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో డ్యూటీ డాక్టర్, స్టాఫ్ నర్స్ ఉండనుండగా అత్యవసర చికిత్సతో పాటు 105 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి శనివారం ఫిజియోథెరపీ డాక్టర్ కూడా అందుబాటులో ఉంటారని, ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం అవసరమైతే ప్రభుత్వ దవాఖానకు పంపిస్తామని డాక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవీ, ఉప వైద్యాధికారి జువేరియా, మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, న్యాయమూర్తులు శ్రీవాణి, లక్ష్మి కుమారి, కుమార్, వివేక్, నీరజ, అరుణ, వెంకటేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ రఘునందన్ రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, కేవీ వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వీ వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, జూలూరు శ్రీరాములు, ఆరెల్లి రాములు, కోర్టు పరిపాలన అధికారి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, డిసెంబర్ 13: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన క్రైస్తవులను సన్మానించేందుకు, అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సంబురాల్లో భాగంగా సామాజిక, విద్య, వైద్యం, సాహిత్యం, కళ, క్రీడారంగాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ చూపిన వారితో పాటు విశేష సేవలందించిన సంస్థల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 30 ఏళ్లకు పైబడిన వారు అర్హులని, దరఖాస్తు ఫాం వెబ్‌సైట్ www.tscmfc.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో ఈనెల 15వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 99897 27382లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## సర్టిఫికెట్ అందజేత

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 13: కెరీర్ పాయింట్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భూపతి రజినీ దేవి పర్యవేక్షణలో జిల్లాకు చెందిన అట్ల శ్రీనివాస్ రెడ్డి పరిశోధన పత్రం 'ద రోల్ ఆఫ్ మూవీ ఇన్ రిఫ్లెక్షన్ ఆఫ్ మిర్రర్ ఆఫ్ పాలిటిక్స్' ప్రచురించారు. కాగా, కెరీర్ పాయింట్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రమోద్ మహేశ్వరి, ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ అబిద్ హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ డాక్టర్ అమిత్ శర్మ ప్రచురణ సర్టిఫికెట్‌ను అట్ల శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అట్ల శ్రీనివాస్ రెడ్డిని పలువురు రీసెర్చ్ స్కాలర్లు అభినందించారు. ఈ పరిశోధన పత్రం కెరీర్ పాయింట్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెర్చ్ https://doi.org/10.5281/zenodo.10252060లో అందుబాటులో ఉంచినట్లు అట్ల శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# విద్యార్థికి అభినందన

చొప్పదండి (రామడుగు), డిసెంబర్ 13: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థి సుదీష్ణ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో సుదీష్ణ పాల్గొంటుందని పేర్కొన్నారు. కాగా, పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

# తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



సబ్ రిజిస్ట్రార్ రాజేశ్‌ను శాలువాతో సత్కరిస్తున్న దస్తావేజుల లేఖరులు

తిమ్మాపూర్, డిసెంబర్13: తిమ్మాపూర్‌లోని కరీంనగర్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఎస్ రాజేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్ రిజిస్ట్రార్‌గా పని చేసిన ఆయన తిమ్మాపూర్‌కు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న జావిద్ సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగనున్నారు. కరీంనగర్ రూరల్ పరిధిలోని భూ క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు లేకుండా పని చేస్తానని సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్ పేర్కొన్నారు. కాగా, ఆయనను తిమ్మాపూర్‌లోని దస్తావేజుల లేఖర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## తేజస్ విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, డిసెంబర్ 13: కొత్తపల్లిలోని తేజస్ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ సీహెచ్ సతీశ్‌రావు పేర్కొన్నారు. ఇటీవల నగరంలోని లయోల కళాశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో శ్రీకర్, ఎన్ ఓం ప్రకాశ్, ఎండీ అలీమొద్దీన్, ఎం సాయికిరణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. బుధవారం ఆయన విద్యార్థులను అభినందించారు.